క్లుప్తంగా

వెలుగు పాఠశాలలో అన్నదానం

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో సోమవారం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి వృద్ధాశ్రమం లో అన్నదానం చేశారు. పాఠశాల నిర్వాహకులు ఉదయ్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తాలూకా సీఐ శేఖర్, టు టౌన్ సీఐ యువరాజ్, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా డాక్టర్ రమేష్ బాబు



మదనపల్లె : అన్నమయ్య జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా సీనియర్ వైద్యులు డాక్టర్ రమేష్ బాబు సోమవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మి వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోవడంతో, నిమ్మనపల్లె లో మెడికల్ ఆఫీసర్ గా పని చేస్తున్న డాక్టర్ రమేష్ బాబునును డీఎంహెచ్‌ఓగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తానన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని పాత కాలేజీ మైదానంలో సోమవారం మనోజ్ క్లినిక్ రామాంజులు ఆధ్వర్యంలో మదనపల్లె వెంకటేశ్వర మల్టిస్పెషాలిటీ ఆస్పత్రి హార్ట్ స్పెషలిస్టు డాక్టర్ కిషోర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సుమారు 150 మందికి బీపీ, షుగర్ పరీక్షలతో పాటు గుండెకు సంబంధించిన సమస్యలపై వైద్య పరీక్షలు చేసి సూచనలు,సలహాలు ఇచ్చారు.

రాష్ట్ర లోకాయుక్తకు ఘనస్వాగతం



లోకాయుక్తకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్, ఆర్ఐ

పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర ఉమ్మడి హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పీ.లక్ష్మణరెడ్డి మండలంలోని టి.సదుం పంచాయతీలోని స్వగ్రామం చెన్నరాయునిపల్లికి విచ్చేసారు. ఈ సందర్భంగా సోమవారం తహసీల్దార్ నరసింహారావ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, ఆర్ఐ అనీషా మర్యాద పూర్వకంగా కలసి లోకాయుక్తకు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ నెల 6వ తేదీ వరకు చెన్నరాయునిపల్లిలోనే విడిది చేసి 7వ తేదీన ఉదయం లోకాయుక్త తిరిగి కర్నూలుకు వెళతారని అధికారులు పేర్కొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

తంబళ్లపల్లె: స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీ ఐలో రెండవ విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో 31, ఫిట్టర్‌లో 39, సివిల్‌లో 23 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్, ఇంటర్మీడియట్‌లో పాస్ లేక ఫెయిలైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మొండి బకాయిలు వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఈఓ గురుమోహన్

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో మొండి బకాయిలు వెంటనే వసూలు చేయాలని పంచాయతీ ఈవో వై. గురు మోహన్ అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అక్రమ కొళాయిలు గుర్తించి వాటిని తక్షణమే తొలగించాలన్నారు. అనుమతి లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలో స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జీనత్‌షఫీ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

3న జిల్లా జూనియర్ బాలిక ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ: జిల్లా సబ్ జూనియర్స్, జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక ఈనెల 3న నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ సభ్యులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. స్థానిక పోతబోలు సమీపంలోని వేద ఉన్నత పాఠశాలలో 3న మధ్యాహ్నం 3 గంటలకు ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికకు వచ్చే క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టినరోజు సర్టిఫికెట్ తమ వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9502074146, 9703282672ను సంప్రదించాలన్నారు.

వామ్మో..వారపు సంతకు ఫోను

- వారపు సంతలో యథేచ్ఛగా చోరీలు
- వరుస సెల్‌ఫోన్ చోరీలతో హడలెత్తిపోతున్న జనం
- భయాందోళనలో వ్యాపారులు, వినియోగదారులు



గుర్రంకొండలో రద్దీగా వారపుసంత (ఫైల్)

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలోని వారపు సంతలో సెల్‌ఫోన్ దొంగలు విజృంభిస్తున్నారు. గత నెల రోజులుగా సెల్‌ఫోన్ చోరీలు వరుసగా జరుగుతున్నాయి. వారపు సంతలో యథేచ్ఛగా సెల్‌ఫోన్ చోరీలు జరుగుతుండడంతో వ్యాపారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మూడు జిల్లాల నుంచి వ్యాపారులు ఇక్కడి వారపు సంతలకు విచ్చేస్తుంటారు.

నాలుగు మండలాల నుంచి ప్రజల రాక

పట్టణంలోని మేజర్ పంచాయతీ వారపు సంతకు నాలుగు మండలాల ప్రజలు వస్తుంటారు. ప్రతి శుక్రవారం ఇక్కడ వారపు సంత నిర్వహిస్తారు. ఉదయం నుంచి రాత్రి ఏడు గంటల వరకు వారపు సంత రద్దీగా ఉంటుంది. అన్నమయ్య జిల్లాతో పాటు చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన వ్యాపారులు తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకొనేందుకు ఇక్కడి వారపు సంతకు వస్తుంటారు. వేలాది మంది జనంతో వారపు సంత కిక్కిరిసిపోతుంటుంది.

నెలరోజులుగా అంతుచిక్కని చోరీలు

నెలరోజులుగా నాలుగు వారపు సంతల్లో వరుసగా సెల్‌ఫోన్లు చోరీ అవుతున్నాయి. గత నెల మొదటి వారం నలుగురి సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. రెండవ వారం ఆరుగురి సెల్‌ఫోన్లను దొంగలు ఎత్తుకెళ్లారు. మూడవ వారం మరో ఏడుగురి సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. జూన్ 28 న నిర్వహించిన వారపు సంతలో ఏకంగా ఎనిమిది మంది సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. ఇప్పటి వరకు రూ. 6 లక్షలు విలువ చేసే సెల్‌ఫోన్లను చోరీ చేశారు. నిత్యం రద్దీగా ఉండే వారపుసంతలో జనాన్ని తోసుకొంటూ ఎవరికీ అనుమానం కలుగకుండా కూరగాయలు కొనుగోలు చేసే సాధారణ జనంలా చొర బడి సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్నారు.

బయట ప్రాంతాల నుంచి వస్తున్న దొంగలు

వారపుసంత నిర్వహించే రోజున బయట ప్రాంతాలకు చెందిన దొంగలు గుట్టుచప్పుడు కాకుండా వారపుసంతలోకి చొరబడుతున్నారు. ముఖ్యంగా కదిరి, మదనపల్లె ప్రాంతాలకు చెందిన సెల్‌ఫోన్లు చోరీ చేసే ముఠా సభ్యులు గుర్రంకొండకు బృందాల వారీగా చేరుకొంటున్నట్లు సమాచారం. ద్విచక్రవాహనాల్లో గుర్రంకొండకు చేరుకొని వారపు సంతకు సమీపంలోనే మకాం వేస్తున్నారు. ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంకాలం 4 గంటల వరకు మాత్రమే వారపు సంతలో సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడుతుంటారు. ఇప్పటి వరకు జరిగిన చోరీలన్ని దాదాపుగా ఇవే సమయాల్లో జరిగాయి. గతంలో ఒకసారి వారపు సంతలో సెల్‌ఫోన్ చోరీ చేస్తూ పట్టుబడిన దొంగకు దేహశుద్ధి చేసి ప్రజలు పోలీసులకు అప్పగించిన సంఘటనలు చోటు చేసుకొన్నాయి.

కొరవడిన నిఘా

వేలాది మంది వారపు సంతకు వచ్చి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే ప్రదేశంలో పోలీసుల నిఘా కొరవడింది. ఉదయం నుంచి సాయంకాలం వరకు కనీసం ముగ్గురు పోలీసులైన ఇక్కడ పహారా కాయాల్సిన పరిస్థితి ఉంది. అయితే ఒకరిద్దరు పోలీసులు ఉదయం 10 గంటల సమయంలో వారపు సంత వద్దకు వచ్చి సెల్‌ఫోన్లో తాము విధులు నిర్వహిస్తున్నామంటూ ఫొటోలు తీసుకొని వాటిని పోలీసు శాఖకు చెందిన యాప్‌లలో అప్‌లోడ్ చేసి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే పోలీసులూ సెల్‌ఫోన్ చోరీలపై దృష్టిసారించి కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ నిఘా పెంచుతాం



గుర్రంకొండ వారపు సంతలో పోలీస్ నిఘా పెంచుతాం.గత కొన్ని వారాలుగా సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయని కొంతమంది ఫిర్యాదు చేశారు. పోలీసులతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, ఖరీదైన ఫోన్లు నిత్యం రద్దీగా వారపుసంతలు లాంటి ప్రాంతాలకు తీసుకురావడం భద్రత కాదు. సెల్‌ఫోన్ చోరీపై ప్రత్యేక నిఘా ఉంచి దొంగలను త్వరలో పట్టుకొంటాం.

– నాగార్జునరెడ్డి, ఎస్ఐ, గుర్రంకొండ

కొత్త చట్టాలపై అవగాహన



మదనపల్లె : విద్యార్థులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న టూటౌన్ సీఐ యువరాజు

మదనపల్లె : దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని సీఐలు యువరాజు, ఎన్.శేఖర్‌లు అన్నారు. సోమవారం స్థానిక శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నూతనంగా అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....దేశప్రజలు, సమాజ హితం కోసం కేంద్రం కొత్త నేర, న్యాయ చట్టాలను తీసుకువచ్చిందన్నారు. 21వ శతాబ్ది అవసరాలకు అనుగుణంగా ఐపీసీ, సీఆర్పీసీల స్థానంలో భారత న్యాయసంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత పేరుతో కొత్త చట్టాలు జూలై ఒకటి నుంచి అమల్లోకి వస్తున్నాయన్నారు. 165 ఏళ్ల నాటి చట్టాలతో నేరస్థులకు పడే శిక్షలు చిన్నవిగా కనిపిస్తాయని, మారుతున్న కాలక్రమంలో చట్టాలు, నేరస్థులకు శిక్షలను కేంద్ర ప్రభుత్వం మార్చిందన్నారు. కార్యక్రమంలో జ్ఞానాంబిక కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో..

కలికిరి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టాలపై కలికిరి సీఐ ఆర్.మోహన్ ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం నుంచి వచ్చిన నూతన చట్టాలైన భారతీయ న్యాయ సన్హిత, భారతీయ నాగరిక్ సురక్ష సన్హిత, భారతీయ సాక్ష్య అధినియం పై స్థానిక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చట్టాలలో మార్పులలో భాగంగా తప్పు చేసిన వారికి కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ దేవేంద్రకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో సోమవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి పౌరునికి కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని , గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ కలసిమెలసి ఉండాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూతన చట్టాలతో భద్రత

కలకడ : నూతన చట్టాలు తీసుకురావడంతో భారతదేశ పౌరులకు న్యాయ స్థానాల ద్వారా మరింత భద్రత కల్పించినట్లు అవుతుందని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విశ్వనాథ, వెంకట్రమణ, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

పీలేరు రూరల్ : కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, మార్కెట్ యార్డులో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు కొత్త చట్టాలపై అవగాహ కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సన్హిత 2023, భారతీయ నాగరిక్ సురక్ష సన్హిత 2023, భారతీయ సురక్ష అధినియమ్ 2023 చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి చట్టాలకు లోబడి నడుచుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

గృహ నిర్బంధం అప్రజాస్వామికం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని గృహ నిర్బంధం చేయడం అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకుడు కేవీ రమణ మండి పడ్డారు. సోమవారం ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ఒక ఎంపీని తన సొంత నియోజకవర్గంలోనే తిరగనీయకుండా, దాడులకు గురైన బాధిత కుటుంబీకులకు పరామర్శ చేయనీయకుండా ఆంక్షలు విధించి హౌస్ అరెస్ట్ చేయడం సమంజసం కాదన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులతో పాటు దళితులపై భౌతిక దాడులకు పాల్పడటం, అభివృద్ధి పనుల శిలాఫలకాలు, పార్టీల జెండాల దిమ్మెలు ధ్వంసం చేస్తున్నారన్నారు. వీటిపై పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందించకపోవడమే గాక కనీసం బాధితులకు భరోసా కూడా కల్పించక పోవడం శోచనీయమన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని తహసీల్దార్ నరసింహారావ్‌కు వినతి పత్రం అందజేమన్నారు. ఎంపీపీ మహమూద్, కోఆప్షన్ ఖాదర్‌వలి, ఎంపీటీసీలు కార్యం చంద్రశేఖర్, రవి, ఉత్తన్న, సుబ్రమణ్యం, వాటర్‌షెడ్ చైర్మన్ రఘునాథ్‌రెడ్డిలతో పాటు నాయకులు గిరిస్వామి, ప్రదీప్ రెడ్డి, దండి శ్రీనివాసులు, రాజన్న, ఓబుల్‌రెడ్డి, రాం మోహన్, జయరాంరెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

– ఆర్డీఓ హరిప్రసాద్



భర్త వేధింపుల నుంచి కాపాడాలని ఆర్డీఓ హరిప్రసాద్‌ను వేడుకుంటున్న గుణవతి

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమంలో భాగంగా ప్రజలు సమర్పించిన అర్జీలను వారంలోపు పరిష్కరించాలని ఆర్డీఓ హరిప్రసాద్ ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు అర్జీలను ఆర్డీఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ హరిప్రసాద్ మాట్లాడుతూ...ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సమర్పించిన అర్జీలకు నిర్ణీత కాలపరిమితి ఉంటుందని, గడువులోపు సమస్యను అధికారులు తప్పనిసరిగా పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ సమస్య పరిష్కరించేందుకు వీలుకాని పక్షంలో దానికి కారణాలు తెలుపుతూ... అర్జీదారుడికి ఎండార్స్‌మెంట్ అందించాలన్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో భూసమస్యలు, మ్యుటేషన్, డీకేటీ స్థలాల ఆక్రమణలపై ఎక్కువగా అర్జీలు అందాయన్నారు. వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామానికి చెందిన గుణవతి... అదనపు కట్నం కోసం భర్త రామాంజులు ప్రతిరోజు మద్యం తాగివచ్చి, తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడని, భర్త వేధింపుల నుంచి తనను, బిడ్డలను కాపాడాలని వేడుకుంది. కార్యక్రమంలో డీఏఓ, డివిజనల్ సర్వేయర్ కృష్ణమూర్తి, ఐసీడీయస్ సీడీపీఓ సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోధన సామర్థ్యాన్ని పెంచడానికి టీచ్ టూల్



మాట్లాడుతున్న మొబలైజేషన్ అధికారి కరుణాకర్

మదనపల్లె సిటీ: ఉపాధ్యాయుల్లో బోధన సామర్థ్యాని పెంచడానికి టీచ్ టూల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కరుణాకర్ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో టీచ్‌టూల్ శిక్షణ కార్యక్రమం డివిజన్ నుంచి ఎంపిక చేసిన 200 మంది ఉపాధ్యాయులకు నిర్వహించారు. తరగతి గదిలో విద్యార్థులను ఆకట్టుకునే విధంగా విద్యాబోధన సాగించడానికి అవసరమైన మెలకువలను నేర్పించనున్నట్లు తెలిపారు.తరగతి గదిలో ఉపాధ్యాయులు కేటాయిస్తున్న సమయంలో ప్రతి నిమిషం విద్యార్థుల విద్యాభివృద్ధికి వినియోగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సాల్ట్ ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టులో భాగంగా టీచ్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సుబ్బారెడ్డి, రీసోర్సుపర్సన్లు చిట్టిబాబు,బావాజాన్, అర్జున్‌నాయక్, శ్రీనివాసులు, ఖాదర్‌వల్లి, భాస్కర, లక్ష్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లు అంకితభావంతో పని చేయాలి

– మెడికల్ సూపరింటెండెంట్ ఎమ్మెస్ రాజు



డాక్టర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న వైద్యులు

మదనపల్లె : డాక్టర్లు విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.ఎస్.రాజు అన్నారు. సోమవారం స్థానిక వైద్యశాలలో డాక్టర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు సిబ్బందితో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి అధిక శాతం పేద రోగులు వస్తారని, వారికి సేవా భావంతో వైద్య చికిత్స అందించాలని అన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలన్నారు. విధిగా వైద్యులు తమ పని వేళలలో రోగులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. అనేక రకాల రుగ్మతలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు, వైద్యులు, సిబ్బంది చికిత్సలతో స్వాంతన కలిగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ ప్రసాద రాజు, సీనియర్ వైద్యులు బాబు, మురళి, శివరామ కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులకు సత్కారం

బి.కొత్తకోట: డాక్టర్ డే సందర్భంగా స్థానిక సీహెచ్‌సీ, ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులను సోమవారం బీజేపీ నాయకులు సత్కరించారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గోరంట్ల రమేష్, శీలం రంగారెడ్డి, కావడి రవీంద్ర, మురళీ, సకలా రాము, నరేష్, చౌడరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకున్నాం



మదనపల్లెలో పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



పీలేరు: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె : ఎన్నికల ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్‌ను 4వేల రూపాయలకు పెంచడమే కాకుండా, కూటమి అధికారంలోకి రాగానే మూడునెలలుగా అందాల్సిన మొత్తం కలిపి 7వేల రూపాయలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా...ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నియోజకవర్గ వ్యాప్తంగా 42 సచివాలయాల పరిధిలో ఇళ్లవద్దకే వెళ్లి పెరిగిన పెన్షన్ మొత్తాన్ని స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంతో పండుగ వాతావరణం నెలకుందన్నారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 3వేల పింఛన్ రూ.4వేలు, అలాగే దివ్యాంగులకు రూ.3,000 పెన్షన్‌ను రూ.6,000 పెంచామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ టీడీపీ ప్రభుత్వం తప్పనిసరిగా నిలబెట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ హరిప్రసాద్, తహసీల్దార్ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీఓ భానుప్రసాద్, కౌన్సిలర్ తులసీ, టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, రామకృష్ణ, బాలుస్వామి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

రామసముద్రం: మండలంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా చేతుల మీదుగా అవ్వ, తాతలకు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ సిబ్బందితో ఉదయం ఐదు గంటల నుంచి మండలంలో పెన్షన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు చెప్పిన హామీలను అమలు చేసి తీరుతారన్నారు. అలాగే చొక్కాండ్లపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ,ఎమ్మెల్యే షాజహాన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో విజయకుమార్‌గౌడ్, కొండూరు నారాయణ రెడ్డి, తిప్పన్న, ప్రశాంత్‌రెడ్డి, అన్సర్‌బాషా, శివశంకర, రాజేష్, కోవాకృష్ణమూర్తి, టేక్‌పల్లి రమణ, హరినాథ్‌రెడ్డి, రెడ్డిశేఖర్, బండెల శివ, డాక్టర్ శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ చారిత్రాత్మకం

పీలేరు : పెన్షన్ల పంపిణీ చారిత్రాత్మకమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పీలేరు పట్టణంలోని యల్లమంద క్రాస్, కట్టుకాలువ వీధిలో లబ్ధిదారులకు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పెంచిన రూ. 4 వేల పింఛన్ తోపాటు మూడు నెలల బకాయితో కలపి రూ. 7 వేలు ఇచ్చి మాట నిలబెట్టుకున్నట్లు తెలిపారు. వచ్చే నెల నుంచి రూ. 4 వేలు, వికలాంగులకు రూ. 6 వేలు, కిడ్నీ సమస్య బాధితులకు రూ. 10 వేలు చొప్పున పింఛన్ అందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రెడ్డిబాషా, చాపల సూరి, కంచి సూరి, అమరనాథరెడ్డి, రియాజ్, రెడ్డెప్పరెడ్డి, రాజ పాల్గొన్నారు.

హామీల అమలు ప్రభుత్వ ప్రాధాన్యత

బి.కొత్తకోట: ఎన్నికల్లో కూటమి తరపున ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని తంబళ్లపల్లె టీడీపీ నియోజకవర్గ నేత డి.జయచంద్రారెడ్డి అన్నారు. సోమవారం బి.కొత్తకోట నగర పంచాయతీ, మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు హామీలను అమల్లో భాగంగా తొలి ప్రాధాన్యతగా ఐదు సంతకాలు చేశారన్నారు. పింఛన్లను రూ.4వేలకు పెంచి, ఏప్రిల్ నెల నుంచి పెంచిన పింఛన్ సొమ్మును అందజేశామని చెప్పారు. ప్రజల సంక్షేమానికి, నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. కాగా తొలిరోజు నగర పంచాయతీలో 3,032 పింఛన్లకు 2,789 పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కమిషనర్ పీఆర్.మనోహర్, మేనేజర్ రమాదేవి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త మల్లికార్జున నాయుడు, పార్టీ మండల కన్వీనర్ డి.నారాయణ స్వామిరెడ్డి, కంచి లోకేష్‌రెడ్డి, మస్తాన్. గంజి మోహన్, నాసిర్, శేఖర్‌రెడ్డి, డేరంగుల ఓబులేశు పాల్గొన్నారు.

కలికిరి: మండలంలో సామాజిక పింఛన్లు పంపిణీ 93 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ రామక్రిష్ణయ్య తెలిపారు. పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి సోమవారం ఉదయం కలికిరి పట్టణం మసీదు వీధి, మేడికుర్తి, పత్తేగడ గ్రామాల్లో నూతనంగా పెంచిన పింఛను నగదును నేరుగా లబ్ధిదారులకు అందజేశారన్నారు.

కేవీపల్లె : పింఛన్లు పెంచి ఇవ్వడం పేదలకు వరం లాంటిదని టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని తువ్వపల్లెలో పింఛన్లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచి ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇరగం రెడ్డి, వెంకటరమణ, ఎమ్మార్పీఎస్ నాయకులు రామకృష్ణ, వెంకటేష్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎఫ్-100 యూనియన్ కార్యవర్గం కొనసాగింపు

మదనపల్లె : మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్, రిజిస్టర్డ్‌నెంఎఫ్-100(టీఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో ఎలాంటి నూతన కార్యవర్గం ఏర్పాటుకాలేదని, పాత కార్యవర్గమే కొనసాగుతోందని అధ్యక్షులు జే.వి.నరసింహమూర్తి, జనరల్ సెక్రటరీ బి.మాధవరెడ్డి తెలిపారు. సోమవారం ఎఫ్-100 యూనియన్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో రెండురోజుల క్రితం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లుగా ప్రకటించడం చెక్కుల పంపిణీలో ఒక భాగమేనని, కోర్టులో వేసిన కేసును నిర్వీర్యము చేసేందుకు జరుగుతున్న కుట్రగా జే.వి.నరసింహమూర్తి పేర్కొన్నారు. టీఎన్‌టీయూసీ, ఎఫ్-100 యూనియన్ 31.12.2024 వరకు కొనసాగుతుందని తిరుపతి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వారికి 2023-24కు సంబంధించిన ఈ-ఫారంలో ఇచ్చి ఆమోదముద్ర పొందడం జరిగిందన్నారు. ఇదే విషయం లిక్విడేటర్‌కు తెలిపామన్నారు. కొంతమంది డీసీఎల్‌ను కలిసి నూతన కార్యవర్గ ఏర్పాటును ఆమోదించాల్సిందిగా కోరినట్లు ప్రకటించుకోవడం తగదన్నారు. టీఎన్‌టీయూసీ, ఎఫ్-100 యూనియన్ గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించినా, పేరు వాడుకున్నా, చట్టప్రకారం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. విషయమై నాలుగురోజుల ముందే హోంశాఖ మంత్రి కార్యాలయానికి ఫిర్యాదుచేసినట్లు తెలిపారు.

రశీదు తప్పనిసరి

కలకడ : ఎరువుల దుకాణాలలో రైతులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని, కాలం చెల్లిన మందులు ఇస్తే కేసులు తప్పవని మదనపల్లె ఏడీఏ శివశంకర్ హెచ్చరించారు. సోమవారం కలకడ, బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య , సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు.

డయేరియాపై నిర్లక్ష్యం వద్దు





పీలేరులో అవగాహర కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: డయేరియాపై నిర్లక్ష్యం వద్దు అని మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. సోమవారం మండలంలోని తాటిగుంటపల్లిలో డాక్టర్ శ్రీవిద్య పర్యవేక్షణలో డయేరియాపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వచ్చినందున వర్షాలు పడటం, మామిడి పళ్ల సీజన్ కావడం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వలన నీళ్ల విరేచనాలు ప్రబలడం జరుగుతుందన్నారు. నీటిని కాచి వడపోసుకొని త్రాగాలని, మల విసర్జనకు మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలని, చేతుల శుభ్రత పాటించాలని, త్రాగు నీటి వనరులు కలుషితం చేయరాదని తెలిపారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వనిత, రెడ్డెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అవగాహన

పీలేరు రూరల్ : అతిసారపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం రేగళ్లు పీహెచ్‌సీ పరిధిలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలో ×స్టాప్ డయారియా× కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు పిల్లలు మరణాలకు నీళ్ళ విరేచనాలు ప్రధాన కార్యణమని తెలిపారు. ప్రతి ఏటా 50 వేల మంది పిల్లలు నీళ్ళ విరేచనాలతో దేశంలో మృతి చెందుతున్నారని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది గ్రామ స్థాయిలో పర్యటించి ఓఆర్ఎస్ ప్యాకెట్స్, జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జయలక్ష్మీ, హెచ్ఈ ఉషారాణి, సూపర్‌వైజర్స్ రమాదేవి, చిన్నప్ప, మోహన్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే నియంత్రణ

కేవీపల్లె : అవగాహనతోనే డయేరియా నియంత్రణ సాధ్యమని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ అన్నారు. సోమవారం గర్నిమిట్ట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ×స్టాఫ్ డయేరియా క్యాంపెయిన్× కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు లోపు పిల్లలు, వృద్ధులు అతిసార బారిన పడితే సకాలంలో వారికి చికిత్సఅందకపోతే ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందన్నారు. సురక్షితమైన తాగునీరు తాగాలని, సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలని కోరారు. ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసుకునే విధానంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రమాదేవి, లలిత, సూపర్‌వైజర్ రుక్మిణి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తంబళ్లపల్లె: అతిసార (డయోరియా)పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ అనుపమ తెలిపారు. సోమవారం అతిసార, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అతిసార, సికల్‌సెల్ ఎనీమియా వ్యాధుల లక్షణాలు,తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.